


రాత్రి తొమ్మిదిన్నర కావస్తుంది. పిల్లలకు అన్నాలుపెట్టి చిన్నవాళ్ళిద్దరినీ పడుకోబెట్టింది సుభద్రమ్మ. నాలుగో ఫారం చదువుతున్న అమ్మాయి కమల యింకా చదువుతూనే వుంది.

"అమ్మాయ్, నాన్నగారిని కూడా అన్నానికి రమ్మను, వాడెప్పుడొస్తాడో ఏమో, ఎప్పుడూ యింతే. ఆనందంగా అందరం కలసి ఒకసారి భోంచేద్దామని వున్నా ఒక్కనాడూ జరగదు. ఎటు వెళ్తాడో ఏమో! ఉదయం లేచింది మొదలు సాయంత్రం అయిదువరకు కాలేజీ సరంజామాలు, సాయంత్రం అయిదునుండి రాత్రి పదో, పదకొండో వరకు స్నేహితులు-షికార్లు-సినీమాలు, ఒక్కగానొక్క కొడుకు మనస్పతీరా చూద్దామంటే కనబడడు! ఎప్పుడూ యింతే! నోట్లో సిళ్ళు నోట్లో ఉండం గానే బయలుదేరి వెళ్ళిపోతాడు" అని ఏదో గొణుక్కుంటుంది సుభద్రమ్మ కొడుకు గోపాలరావు గురించి.

"అన్నయ్య రాగానే నాన్నగారు కూడా భోంచేస్తారటమ్మా" అని కూతురి జవాబు.

నారాయణరావుగారు నలభై అయిదో పడిలో నున్న మంచి బింకంగల మనిషి. లంకంత కొంప. పెద్దలు బోలెడు వెనుక వేసి వుంచారు. దానిమీద చాలావరకు వ్యవసాయం చేయిస్తున్నారు. తనకేం. ముగ్గురు ఆడపిల్లలు. పెద్దకొడుకు

గోపాలరావు. కోపమంటే తెలియని, అమాయకపు పెళ్ళాం సుభద్రమ్మ. ఆవిడ ఎప్పుడూ, ఏదో విషయమై గొణుక్కుంటూ, సణుక్కుంటూనే వుంటుంది. వీరందరితోనూ యిలా కాలం చక్కగానే గడిచిపోతుంది. గోపాల రావంటే తల్లీ, దండ్రులకు మితిలేని ప్రేమ. చెల్లెళ్ళకు అన్నయ్యంటే గౌరవం, భక్తి, భయం వున్నాయి, ఇవన్నీ ఆసరా తీసుకునే కాబోలు గోపాలరావు విచ్చలవిడిగా తిరుగుతాడు. స్నేహితులనీ, షికార్లనీ బోలెడు డబ్బు తగలేస్తాడు. రాత్రనక, పగలనక స్నేహితులతో తిరుగుతూ, ఒక్కోరాత్రి యింటికి రాని సంఘటనలు కూడా లేక పోలేదు. తల్లిదండ్రులు తనమీద చూపు తున్న అపారమైన ప్రేమకు ఫలితంగా తల్లిదండ్రులంటే నిర్భయం, నిర్లక్ష్యం చాలాకాతం ఉందనే చెప్పాలి

"అమ్మాయ్, కమలా అన్నయ్యే యింకా రాలేదా ?"

"టైమెంతవుతుంది ?"

"పదిన్నర దాటిందా !"

"ఎప్పుడూ, యింతే పీడు."

"అయినా వాడి తప్పేముంది ? వద్దు మొర్రో వాడిని కాలేజీలో చేర్పించ వద్దు, కాలేజీ కుర్రాళ్ళంటే మరీ రోజుల్లో అంతే ! మనకేం, మన అబ్బాయి ఉద్యో గాలు చెయ్యాలా ? వూళ్ళేలా ? పూర్వం నుండి మన వంశంలోనే పెద్దచదువులు చదవడం, ఉద్యోగాలు చెయ్యడం అనే మాటే లేదంటే విన్నారా, మీ నాన్న."

"తనవితీరా చూద్దామంటే ఒక్క రోజు కనబడడు. ఏ రాత్రో, వస్తాడు. రెండు మెతుకులు కొరికి, ఒక కునుకు తీస్తాడో లేదో, మళ్ళీ తెల్లారకుండా వీధిన పడతాడు."

"ఛీ, ఛీ, ఏం బ్రతుకు" అని సుభద్రమ్మ గొణుక్కుంటూ వుంది.

"అది ఆవిడకు అలవాటే, పిచ్చిది" అని, నవ్వుకున్నారు నారాయణరావు గారు.

* * *

గడియారం ఠంగు, ఠంగుమని పన్నెండు కొట్టింది.

మళ్ళీ యధావిధిగా టక్, టక్మని కొట్టుకుంటూంది.

బయట తలుపుమీద ఎవరో టక్కు, టక్కుమని కొట్టారు

ఎవరో అని నారాయణరావుగారు వాలుకుర్చీలోంచి లేచే లోపల తలుపుల మీదదభ, దభామని వినిపిస్తుంది. నారాయణరావుగారు గబగబా వెళ్ళి తలుపు తీశారు. తలుపు తీసి, ఎదురుగా వున్న ఆకారాన్ని చూసి నిశ్చేష్టుల య్యారు. నోట మాట రాలేదు. ఒంటి నిండా చెమట పట్టింది. పెదవులు వణి కాయి.

"ఎ ... ఎ ... ఎ ... వ ... రు ... ను ... వ్వు ..." తడబడుతూ అడిగారు

"ఏయ్, ఎవరని అడుగుతున్నావా? ముసలి పీనుగా! లే, అడ్డు లే..."

"బా...బు, బా...బు"

"ఏయ్ ఎవర్రా బాబు, నీ బాబులా వున్నానురా? లోపలికి మర్యాదగా దారి యివ్వు. లేదా" అని బొడ్లో దోపివున్న కత్తి ఛప్పున తీశాడు భయంకరమైన రూపం, గళ్ళ లుంగీ, చారల బనీను, మోచేతికి కట్టు కట్టి వున్నాడు. బుగ్గ మీసాలు, చింపిరిగా మాయల పకీరు లాంటి జుట్టు, పొడుగాటి చెంపలు, మెళ్ళో పెద్దరుమాలు, నడుముకు నాల్గంగుళాల వెడల్పు బెల్టు కట్టాడు. కళ్ళు ఎర్రగా వున్నయ్. భయంకరంగా చూస్తున్నాడు. సినీమాలో విలన్‌లా వున్నాడు. నారాయణరావుగారికి కాళ్ళు గజగజ వణికిపోతున్నాయి. భూమి మీద నిలబడటంలేదు.

"ఎ ... ఎ ... ఎ ... వ ... రు ... ను ...వ్వు?"

"ఏయ్, నోర్ముయ్, గట్టిగా ప్రేలావా, ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోతాయ్, జాగ్రత్త. తాళాలు యిలా పడెయ్యి. పద ఇనుప బీరువా దగ్గరకు. ఉఁ నడు." గట్టిగా గద్దించాడు.

ఈ కేకలకు సుభద్రమ్మ, పిల్లలూ అందరూ లేచి అక్కడకు పరుగెత్తుకొచ్చారు వచ్చి రాగానే ఆ భయానక దృశ్యాన్ని చూసి, తెళ్ళప్పగించి చూస్తుంది సుభద్రమ్మ. పిల్లలు గజ గజ వణికిపోతూ టేబిలు క్రింద, బీరువా ప్రక్క దాక్కున్నారు. ఆగంతకుడు రెచ్చిపోయి, నారాయణరావుగారి గుండె దగ్గర కత్తిని పెట్టి "ఉఁ పద. నడు. ఏమైనా తప్పించుకోవడానికి ప్రయత్నించావో, యీ కత్తి నీ గుండెల్ని చవి చూస్తుంది. ఏం డబ్బు తెగ కూడబెట్టి, యిష్టానుసారంగా ఖర్చులు చేయడానికనుకున్నావా?" అని గద్దిస్తున్నాడు.

నారాయణరావుగారు వెనుకకు మౌనంగా ఒక్కొక్కడుగు వేస్తూ వుంటే, ఆగంతకుడు ముందు కొక్కొక్కడుగు వేస్తున్నాడు. సుభద్రమ్మను కూడా గద్దించి, నారాయణరావుగారి ప్రక్కగ నిలబెట్టి నడిపిస్తున్నాడు. పిల్లలు ముగ్గురూ ఎక్కడి వాళ్ళక్కడ గడ గడ వణికిపోతున్నారు. నారాయణరావుగారిని, సుభద్రమ్మను యిద్దర్నీ నడిపించి, ఇనుప బీరువావరకు తీసుకు వెళ్ళి "ఉఁ...తాళాలు తియ్యి ఉఁ." అని బిగ్గరగా అరిచాడు ఆగంతకుడు.

నారాయణరావుగారు గడగడా వణికిపోయి బొడ్లో దోపి వుంచిన తాళాల గుత్తిని బయటకు తీశారు. ఆగంతకుడు తాళాలు అందుకుంటుండగానే ఏదో దభీమని తలమీద పడింది. పడగానే తూలుకుంటూ 'అమ్మా' అని క్రింద పడిపోయాను సుభద్రమ్మ గబాల్న యీ లోకంలోకి వచ్చి పడిపోయిన ఆగంతకుని చూసి "బాబూ" అని అరిచింది.

ఆగంతకుడు నేలమీద పడగానే కాళ్లూ, చేతులూ కొట్టుకుని "నాన్నా, అమ్మా, నన్ను క్షమించండి. నేను మీ బాబుని గోపాలరావుని. నే...ను..." అంటూ స్పృహ కోల్పోయాడు.

సుభద్రమ్మ, నారాయణరావుగారు, పిల్లలూ గాభరాగా చుట్టూ మూగారు. కమల "ఎంత అన్యాయం జరిగిపోయిందన్నయ్యా" అని విలపిస్తూ, వంటింట్లోకి వెళ్ళి, నీళ్ళు తెచ్చి గోపాలరావు ముఖాన జల్లింది. నారాయణరావుగారు ప్రక్క వీధిలోనున్న డాక్టరుగారింటికి పరుగెత్తి వెళ్ళి, డాక్టరుగారిని లేపుకొచ్చారు. డాక్టరుగారు ఏదో యింజక్షను యిచ్చి అడిగారు. నారాయణరావుగారు ఆగంతకునిగా తన కొడుకు రావడం లగాయితూ చెప్పి, కమల ఒణికిపోతూ బీరువా ప్రక్కను దాగుండి, పీలు చూసుకొని ధైర్యంగా అక్కడే పడివున్న ఇనుప గుండుతో విసిరి కొట్టిందనీ, అది వచ్చి గోపాలరావు తలకు తగిలిందని వెంటనే గిల గిల తన్నుకుని పడిపోయాడనీ, కళ్ళ నీళ్ళు తుడుచుకుంటూ వివరించారు.

కొంతసేపటికి గోపాలరావుకు స్పృహ వచ్చి వెర్రిగా ఒక కేకపెట్టి మళ్ళీ స్పృహ కోల్పోయాడు. డాక్టరుగారు పరీక్షించి గాద్గదికంగా "యింక లాభంలేదు నారాయణరావుగారూ. అబ్బాయి తలకు బలమైన దెబ్బ తగిలింది. కాబట్టి మనస్సాంచల్యం తప్పకుండా వస్తుంది. పిచ్చివానిగా మారిపోతాడు. మెంటల్ షాక్" అని చెప్పి వెళ్ళిపోయాడు.

జరిగిన అఘాయిత్యాన్ని తలచుకొని, దైవాన్ని దూషించి, విధిని తిట్టుకుంటూ పాపమా భార్యాభర్తలు కంటికీ మంటికీ ఏకధారగా భోరున ఏడ్చారు. ఉదయాన్నే యీ విషయం వూరంతా ప్రాకింది. గోపాలరావు స్నేహితులు కూడా యీ దృశ్యాన్ని చూడటానికి వచ్చారు అందులో ఒక స్నేహితుడు "పాపం చెప్పినా వినకుండా వచ్చి, తన పచ్చని నూరేళ్ళ జీవితాన్నే నాశనం చేసుకున్నాడు రాత్రి నాటకం రిహార్సల్సు వేళాం. అదే ఫైనలు రిహార్సలు కూడ. అందులో గోపాలరావు విలన్ వేషము, అంటే గజదొంగగా నటిస్తున్నాడు. రిహార్సల్సులో బాగా చేశాడు. అదే వేషంతో యింటికి వచ్చి, తల్లిదండ్రులను తమాషాగా జడిపించి, మన్ననలు పొందుదామని వచ్చి, తన పచ్చని జీవితాన్నే పాడుచేసుకున్నాడ"ని చెప్పి రెండు వెచ్చని కన్నీటిబొట్లు విడిచిపెట్టాడు. "అంతేనా, నాయనా, ఈ కాలపు కుర్రాళ్ళంతా అంతే, వెనక ముందులాలోచించక తమ భవిష్యత్తునే నాశనం చేసుకుంటున్నార"ని ఒక బామ్మ దీర్ఘం తీస్తూ తన దీర్ఘోపన్యాసాన్ని ముగించింది. యివేవీ తనకు పట్టినట్టు గోపాలరావు గోళ్ళు గిల్లుకుంటూ కూర్చొని నవ్వుకుంటున్నాడు పిచ్చిగా.